




# తొలి సమయం

దిన పత్రిక

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 315 సోమవారం 11-11-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


## పాలమూరుపై కేసీఆర్ నిర్లక్ష్యం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి - ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు
- ప్రాజెక్టులు పూర్తి చేయనందుకే ఇప్పటికీ వలసలు - ఇక్కడి ప్రజలకు నిధులివ్వాల్సిన బాధ్యత ఉంది
- కొందరు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు- దయచేసి పాలమూరు అభివృద్ధికి అడ్డుపడకండి
- కుట్రతో కాళ్లలో కట్టెలు పెడితే.. మట్టి మనుషుల - చెమటలో కొట్టుకుపోతారు: సీఎం రేవంత్‌రెడ్డి

**తొలి సమయం హైదరాబాద్,**

మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపడం వల్లే తెలంగాణ ఉద్యమ భాగస్వామిగా, రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండు సార్లు సీఎంగా పనిచేసే అవకాశం కేసీఆర్‌కు వచ్చిందని.. కానీ, ఆయన ఈ ప్రాంత అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వల్ల వలసలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు ఆదివారం ఆయన హాజరయ్యారు. అక్కడ రూ.110 కోట్ల వ్యయంతో 3.7 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఎలివేటెడ్ ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రేవంత్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసినా పాలమూరు కూలీల చెమటతో కట్టిన ప్రాజెక్టులే ఉంటాయన్నారు. ఈ ప్రాంత బిడ్డను సీఎంను చేసిన ప్రజల కోసం కచ్చితంగా నిధులు మంజూరు చేసి.. ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆలయాలతోపాటు నాడు నెహ్రూ చెప్పినట్లు ఆధునిక దేవాలయాలైన సాగునీటి ప్రాజెక్టులకూ నిధుల ప్రవాహం కొనసాగిస్తామని తెలిపారు. కృష్ణమ్మ తలాపున పారుతున్నా మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రజలకు చుక్క నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించామని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. చిల్లరమల్లర రాజకీయాల కోసం అపర భగీరథ ప్రయత్నానికి వ్యతిరేకంగా కుట్రలు చేయొద్దని, కాళ్లలో కట్టెలు పెడితే.. మట్టి మనుషుల చెమటలో కొట్టుకుపోతారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి హెచ్చరించారు. తనపై



రాజకీయంగా కోపం ఉంటే.. మరో రకంగా తీర్చుకోవాలేగానీ.. అభివృద్ధికి అడ్డుపడొద్దని కోరారు. కేసీఆర్ హయాంలో వారి ప్రాంతాలను అభివృద్ధి చేసుకున్నప్పుడు తాము ఏడవలేదని, బాధ అనిపించినా.. ఓర్చుకున్నామన్నారు. ఇప్పుడు తమకు అవకాశం వచ్చిందని, నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

అయితే, పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేస్తుంటే కొంతమంది దుర్మార్గు లు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. పాల మూరు ఆత్మగౌరవాన్ని అణచాలని చూస్తే యువత తిరగబడు తుందని స్పష్టం చేశారు. అంతకు ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసేందుకు సీఎం ఆధ్వర్యంలో అందరం కలిసికట్టుగా పని చేస్తున్నామని తెలిపారు. కురుమూర్తి స్వామి ఆలయం వద్ద ఎలివేటెడ్ ఘాట్‌రోడ్డుకు రూ.110 కోట్లను కేవలం నెల రోజుల్లోపే మంజూరు చేశామని, వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి రోడ్డును పూర్తి చేస్తామని అన్నారు. సీఎం వెంట మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీహరి ఉన్నారు.

## వాడివేడిగా మహా సమరం!

- సమస్త బలగాలను మోహరించిన మహాయుతి, ఎంవీఏ కూటములు
- వ్యూహాత్మకంగా కాంగ్రెస్ ప్రచారం
- పలు రాష్ట్రాల నేతలు రంగంలోకి
- బీజేపీ వెనుకబాటుతో మోదీ సుడిగాలి ప్రచారం.. ఆయన వెంట షా, ఆదిత్యనాథ్



**న్యూఢిల్లీ, నవంబరు 10:** మహారాష్ట్రలో మరో పది రోజుల్లో ఎన్నికలు జరగనుండగా అధికార మహాయుతి కూటమి, ప్రతిపక్ష మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి సమస్త బలగాలను మోహరించి గెలుపుకోసం శ్రమిస్తున్నాయి. ఎంవీఏలో శివసేన(ఠాక్రే), ఎన్సీపీ (పవార్), కాంగ్రెస్ పార్టీలున్నాయి. ఆ కూటమి తరఫున శరద్ పవార్, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతోపాటు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవలి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం త్రుటిలో తప్పిపోవటంతో మహారాష్ట్రను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోవద్దని కాంగ్రెస్ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది. దీంట్లో భాగంగానే తమ పార్టీ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకల నుంచి సీఎంలు, డిప్యూటీ సీఎంను రప్పించి.. ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ గ్యారెంటీల అమలు గురించి ప్రజలకు చెప్పిస్తోంది. కాంగ్రెస్ రాష్ట్రాల్లో హామీలను అమలు చేయటంలేదన్న ప్రధాని మోదీ తదితర బీజేపీనేతల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ ఈ వ్యూహరచన చేసింది. కాగా, ప్రచారపర్వంలో ఎంవీఏకు దీటుగా మహాయుతి నేతలు నితిన్ గడ్కరీ, దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ షిండే ప్రచారం చేయలేకపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహాయుతిలో బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్‌పవార్) పార్టీలున్నాయి. రాష్ట్రంలో బీజేపీకి పెద్ద దిక్కైన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ విదర్భ ప్రాంతంలో తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుండగా, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్.. తన నియోజకవర్గం నాగ్‌పూర్ సౌత్ వెస్ట్‌లో విజయం కోసం చెమటోడుస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ తరఫున ప్రచారం చేసే గట్టి స్థానిక నేతలెవరూ లేని పరిస్థితి నెలకొనడంతో ప్రధాని మోదీ శుక్రవారం నుంచి స్వయంగా రంగంలోకి దిగారు. ఆయనతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రచారం నిర్వహిస్తున్నారు.

## బీసీలకు కాంగ్రెస్ ఒక్క హామీనీ నెరవేర్చలే

- 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే - స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- కులగణనను స్వాగతిస్తున్నాం - సర్వేకొచ్చేవారిని హామీలపై నిలదీయాలి
- కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై వారోత్సవాలు - పొంగులేటిది బాంబుల మంత్రిత్వశాఖ: కేటీఆర్



**తొలి సమయం హైదరాబాద్,** బీసీలను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏడాది కిందట కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఓట్ల కోసం దొంగ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఒక్క బీసీ డిక్లరేషన్ హామీ అయినా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన పూర్తయిన తరువాత, బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తాము కులగణనను సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. 42% రిజర్వేషన్లు అమలు చేయాలని ఇంటింటి సర్వేకు వచ్చే అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణ రైతులకు పంటపై బోనస్ రూ.500లు ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఏ ఒక్క రైతుకైనా రూ.500ల బోనస్ ప్రభుత్వం ఇచ్చినట్లు నిరూపిస్తే తాము రాజీనామాలకు సిద్ధమని సవాల్ చేశారు. ఒక్క బీసీకైనా వడ్డీ లేని రూ.10లక్షల రుణం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఐదేళ్లలో బీసీల సంక్షేమం కోసం ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. తొలి ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.8వేల కోట్లే ప్రకటించిందని, అవికూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని విమర్శించారు. సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ఆందోళన చేస్తుంటే దుర్మార్గంగా అరెస్టులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ వెల్ఫేర్‌తో పాటు ఎంబీసీలకు మరో మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, తన క్యాబినెట్‌లో 18మంది మంత్రులను భర్తీ చేసుకునే చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి అని, కొత్త మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తా.. అంటే ఎవరు న మ్ముతారని ప్రశ్నించారు. దళిత బంధు నిధులు ఇవ్వాలని అడిగితే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడులు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, అబద్ధాల సీఎంను బీఆర్ఎస్ తరుపున నిలదీస్తూనే ఉంటామన్నారు. ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవాలకు ఏర్పాటు చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలపైన తాము కూడా వారోత్సావాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బాంబుల శాఖ ఇచ్చారేమో.. ఆయన రోజుకో బాంబు పేల్చుతానంటున్నారని, ఆ బాంబు కాంగ్రెస్ మంత్రుల్లో ఎవరిపైన పేలుతుందో అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## కమీషన్ల కోసం రైతుల బలి

**ధాన్యం సేకరణలో సర్కారు నిర్లక్ష్యం.. బోనస్ ఎగ్గొట్టేందుకు కొనుగోలు ఆలస్యం: సంజయ్**



**తొలి సమయం హైదరాబాద్, నవంబరు 10:** బ్రోకర్ల నుంచి కమీషన్లు దండుకునేందుకు రైతుల ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం బలి చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. బోనస్ పైసలివ్వకుండా తప్పించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలను నేటికీ పూర్తిగా ప్రారంభించకపోవడం దారుణమన్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంజయ్ ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం వడ్లకు క్వింటాకు రూ.2,300కు పైగా చెలిస్తోందని.. దీనికి రూ.500 బోనస్ చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. ఈ సీజన్‌లో 50 లక్షల టన్నుల సన్న వడ్లకు రూ.500 చొప్పున రూ.2,500 కోట్ల బోనస్ చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు నయా పైసా బోనస్ ఇవ్వలేదని మండిపడ్డారు. బోనస్ సంగతి దేవుడెరుగు..? కొనుగోళ్లు లేక విసిగిపోయిన రైతన్నలు ఇప్పటికే 20 లక్షల టన్నుల వడ్లను మిల్లర్లకు అమ్ముకున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాత కాంగ్రెస్ సర్కారు విజయోత్సవాలు జరుపుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేవాలయాలపై దాడులు చేస్తున్న వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

**రాకేశ్‌కు వైద్య ఖర్చులు అందిస్తా..**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లికి చెందిన వికలాంగ విద్యార్థి గూళ్ల రాకేశ్ వైద్యానికి అయ్యే ఖర్చులను భరిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాకేశ్‌పై వచ్చిన కథనంపై సంజయ్ స్పందించారు. ఆదివారం రంగయ్యపల్లిలో రాకేశ్‌ను కలిసి మాట్లాడారు. అతడికి త్రిచక్ర వాహనాన్ని అందిస్తానని చెప్పారు. అలాగే గ్రామంలో ఇటీవల పిడుగుపడి పెద్ద మొత్తంలో ఆస్తిం నష్టం జరిగిన ఓ కుటుంబాన్ని సంజయ్ పరామర్శించారు.

## కమ్ముకొచ్చిన మృత్యువు

- శ్రీశైలం డ్యామ్ సందర్శనకు బయల్దేరిన ఏడు గురు స్నేహితులు
- డ్రైవర్ నిద్రమత్తు.. చెట్టును ఢీకొన్న కారు
- ఇద్దరి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

**యాచారం/కందుకూరు/పహాడిషరీఫ్, నవంబరు 10:** వారంతా స్నేహితులు.. ఆదివారం కావడంతో సరదాగా గడిపేందుకు కారు అద్దెకు తీసుకుని శ్రీశైలం డ్యామ్ సందర్శనకు బయలుదేరారు. అయితే కారు నడుపుతున్న వ్యక్తికి నిద్రమత్తు కమ్ముకురావడంతో వారి యాత్ర విషాదంగా మారింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల గేటు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన ఏడుగురు స్నేహితులు ఇంతియాజ్‌ఖాన్, జుబెర్ నాయాబ్‌ఖాన్, అబ్దుల్ సమీర్, అబ్దుల్ సిరాజ్ ఖాన్, అబ్దుల్ అజీజ్ ఖాన్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ ఫయాజ్.. శనివారం రాత్రి మెహదీపట్నంలోని ఓ ట్రావెల్స్‌లో కారు అద్దెకు తీసుకుని శ్రీశైలం డ్యామ్ సందర్శనకు బయల్దేరారు. ఆదివారం



తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హైవే నుంచి ముచ్చర్ల గేట్ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జుబెర్ నాయాబ్‌ఖాన్ (18) అక్కడికక్కడే మృతిచెందగా, కొనఊపిరితో ఉన్న ఇంతియాజ్‌ఖాన్ (18)ను పోలీసులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. కారు నడుపుతున్న అబ్దుల్ సమీర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. గాయపడిన ఐదుగురిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన పహాడీషరీఫ్ ప్రాంతంలో విషాదాన్ని నింపింది.

# ముల్కలపల్లి గ్రామంలో జన్మించిన కోహినూర్ వజ్రం

**చదువుకున్న చదువులతో రాణించి, 1500 మందికి ఉద్యోగ అవకాశాలు**

**యువతకు ఆదర్శంగా నిలుస్తున్న చదువు మహిపాల్ రెడ్డి**

**శ్రీరామ్ ఫైనాన్స్ లో తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ గా రాణిస్తున్న రైతన్న ముద్దుబిడ్డ**



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 10:** పుట్టింది మారుమూల గ్రామం..పెరిగింది వ్యవసాయం చకుటుంబం..తండ్రి ప్రోత్సలంతో చదువుకున్న చదువులతో రాణించాడు ప్రస్తుతం శ్రీరామ్ ఫైనాన్స్ లో తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్న చదువు మహిపాల్ రెడ్డి విలేకరులతో తన మనోభావాలను పంచుకున్నారు . జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన రైతు నాయకుడు..తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి-సరోజనమ్మ దంపతులకు 26 అక్టోబర్ 1975న రెండవ సంతానంగా జన్మించిన ఈ కోహినూర్ వజ్రం,విద్యాభ్యాసం తన తండ్రి చదువు అన్నారెడ్డి గ్రామస్తుల పిల్లల కోసం గ్రామంలో కట్టించిన యుపిఎస్ పాఠశాలలో 1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు విద్యనభ్యసించి అనంతరం 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు సరస్వతి శిశు మందిర్ జమ్మికుంటలో, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కాకతీయ హైస్కూల్ హుజురాబాద్ లో, ఇంటర్ అరుణోదయ కాలేజీ హనుమకొండలో, డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కాకతీయ యూనివర్సిటీ నందు విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన ఆయన 2000 సంవత్సరంలో తన తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో శ్రీరామ్ ఫైనాన్స్ లో చేరాడు. చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్న మహిపాల్ రెడ్డి శ్రీరామ్ ఫైనాన్స్ లో చేరినప్పటి నుంచే బాగా కష్టపడుతూ అంచెలంచెలుగా ఎదిగారు. హైదరాబాద్ లో శ్రీరామ్ ఫైనాన్స్ లో ఎగ్జిక్యూటివ్ గా ఉద్యోగంలో చేరిన ఆయన ఆ తర్వాత వరంగల్ శ్రీ రామ్ ఫైనాన్స్ మేనేజర్ గా, వరంగల్ డివిజనల్ మేనేజర్ గా, అనంతరం హైదరాబాదులో తెలంగాణ రీజనల్ మేనేజర్ గా పనిచేసి, ప్రస్తుతం శ్రీరామ్ ఫైనాన్స్ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్నాడు. చదువుకున్న చదువులతో తాను ఒక్కడే బాగుపడకుండా.. ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచి..శ్రీరామ్ ఫైనాన్స్ లో ఉద్యోగాలను కల్పించి..నిరుపేద కుటుంబాలకు చెందిన యువకులకు అండగా నిలిచి..అందరికీ ఆదర్శ ప్రాయుడిగా ముందుకు సాగుతున్నాడు. ముల్కలపల్లి గ్రామంలో చదువు సరోజినమ్మ-అన్నారెడ్డి దంపతులకు రెండవ సంతానంగా జన్మించిన మహిపాల్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, చదువు నేర్పిన గురువులకు, తోటి స్నేహితులకు పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్నాడు. ఈ క్రమంలో రాష్ట్రంలో సుమారుగా 1500 మంది నిరుద్యోగ యువతకు, తన సొంత మండలంలో సుమారుగా 100 మంది నిరుద్యోగ యువతకు శ్రీరామ్ ఫైనాన్స్ లో ఉద్యోగాలు కల్పించి..నిరుపేద కుటుంబాలను వీధిన పడకుండా వారిని ఆదుకోవడంతో శ్రీరామ్ ఫైనాన్స్ లో ఉద్యోగాలు పొందిన యువకుల తల్లిదండ్రులు ఆయనను వారి ఆరాధ్య దైవంగా భావిస్తున్నారు. చదువు మహిపాల్ రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని..ముందుకు పోయినట్లయితే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అనేదే ఉండదని, ఆయన యొక్క గొప్పతనాన్ని, సేవాభావాన్ని ఈ సందర్భంగా ఉమ్మడి ఓరుగల్లు జిల్లా ప్రజలు, ప్రముఖులు, విద్యావేత్తలు అభినందిస్తున్నారు. ఆయన చేసే వృత్తిలో కఠినత్వంగా ఉన్నప్పటికీ..డ్యూటీ అయిపోయిన తర్వాత.. శ్రీరామ్ ఫైనాన్స్ లో ఉద్యోగం చేసే వారిపై మమకారాన్నే చూపిస్తారని, ఆయన వృత్తిలో భాగంగా ఎన్నో అవార్డులు అందుకున్నప్పటికీ, ఆయన కోరుకునేది మాత్రం కష్టం ఫలితం మాత్రమేనని తోటి ఉద్యోగులు అంటున్నారు. అదేవిధంగా పదవ తరగతిలో విద్యలో రాణిస్తున్న విద్యా కుసుమాలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2014 సంవత్సరం నుంచి 3000 మంది విద్యార్థులకు 5000 రూపాయల చొప్పున స్కాలర్షిప్ లు అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి విలేకరులకు తెలిపారు.

# ఇసుక బిల్లులు తక్షణమే మంజూరు చేయాలి

**- సీనరేజి స్థానిక పంచాయితీలకే కేటాయించాలి**

**- ఆదివాసీల సొమ్ము దోచుకుంటే ఉద్యమిస్తాం - ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నర్సింహా మూర్తి**



**తొలి సమయం, వాజేడు /నవంబర్ 10**

ఇసుక బిల్లులు గిరిజన సొసైటిలకు చేయడం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తోందని ఆదివాసి నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ప్రభుత్వం పైన మండిపడ్డారు. ఆదివారం వాజేడు మండలం లోని ఇప్పగూడెం గ్రామం లో మండల అధ్యక్షులు మొడెం నాగరాజు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింహా మూర్తి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆదిలాబాద్ జిల్లాల్లో జరుగుతున్న ఇసుక క్వారీల ద్వారా ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు లబ్ది పొందుతూందని అన్నారు. కానీ గిరిజన ఇసుక సొసైటీ లకు మాత్రం రావాల్సిన బిల్లులు ఏళ్ళు గడుస్తున్నా ఇవ్వడం లేదన్నారు. 2021 నుండి ఇప్పటివరకు కొన్ని వేల కోట్ల రూపాయలు ఇసుక ద్వారా డీడీ ల రూపంలో ప్రభుత్వానికి సమకూరిందాన్నారు. పెసా చట్టం ద్వారా ఏజెన్సీ లోని లఘు ఖనిజాల నిర్వహణ అధికారం గిరిజనులకు ఉందన్నారు. కానీ ప్రభుత్వాలు గిరిజన ఇసుక సొసైటీ లకు రావాల్సిన వందల కోట్ల రూపాయలను తమ రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నట్లు పేర్కొన్నారు. గిరిజన సొసైటిల స్వయం ఉపాధిని ప్రభుత్వం దెబ్బతిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీలను ఏర్పాటు చేసుకొని ఇసుకను ప్రభుత్వానికి అమ్మే క్రమంలో లేబర్ ఖర్చులు, మెయింటెనెన్స్ ఖర్చులు, ఇతర ఖర్చులన్ని గిరిజన సొసైటిల మీద పడి తెచ్చిన అప్పులకు వడ్డీలు ఎక్కువ అవుతున్నాయని వెంకటాపురం, వాజేడు గిరిజన ఇసుక సొసైటి లు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇసుక క్వారీల వల్ల ఆదివాసీలకు ఇప్పటి వరకు ఒరిగింది ఏమి లేదన్నారు. ప్రభుత్వం, రేజింగ్ కాంట్రాక్టర్లు లబ్ది పొందుతున్నారని అన్నారు. రావాల్సిన బిల్లులు ఏళ్ళు గడిసిన రాకపోవడం తో అనేక ఆర్ధిక సమస్యలు ఎదురు కుంటున్నట్లు ఆదివాసీలు వాపోతున్నారని తెలిపారు. టిజిఎంటిసి అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదని ఆదివాసీలు తమ గోడు వెళ్ళబుచ్చు తూ ఉన్నారని ఆయన అన్నారు. గిరిజనులను ఆర్ధికంగా బలోపేతం చేయడానికి స్వయం ఉపాధి కలిగించడానికి ఇసుక క్వారీల నిర్వహణ అనుమతులు ఇచ్చినప్పటికి ఆ లక్ష్యం మాత్రం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నెరవేరడం లేదన్నారు. గిరిజన ప్రాంత ఖనిజ సంపదను అప్పనంగా తీసుకెళ్తూ ఆదివాసీల నోట్లో ప్రభుత్వం మట్టి కొడుతోందన్నారు. ఆదివాసీలు గత నాలుగేళ్లుగా బిల్లులు రాక దగా పడ్డారని, ఈ ప్రభుత్వం కూడా ఆ విధానాన్నే కొసగిస్తోందని పేర్కొన్నారు. ఇసుక ద్వారా వచ్చే సీనరేజి నిధులను స్థానిక సంస్థలకు కేటాయించాలన్నారు. డి ఎంఎఫ్ టి ద్వారా నిధులన్నీ నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల అభివృద్ధి కి కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇసుక ప్రభావిత ప్రాంతాల్లోనే ఆ నిధుల తో అభివృద్ధి చేయాలని అన్నారు. ఇసుక సొసైటీ లకు ఇచ్చే రేట్లు తక్కువ ఉన్నాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కిబిక్ మీటర్ కు 600 వందల రూపాయలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పనంగా అర్ధ రూపాయి ఆదివాసీల చేతులో పెట్టి కోట్ల రూపాయిలు ప్రభుత్వం దోచుకుంటున్నట్లు విమర్శించారు. లోప భూయిష్ట విధానాలతో ఆదివాసీలను ఎప్పుడు ఆర్ధికంగా నిలబెడతారని నిలదీశారు. ఏళ్ల తరబడి ఉన్న బిల్లులను ప్రభుత్వం తక్షణమే మంజురు చేసి ఆదివాసీలను ఆదుకోవాలని కోరినారు. లేని పక్షంలో ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోరాటం చేయనున్నట్లు పేర్కొన్నారు.

## సామాజిక సర్వేను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**తొలి సమయం భూపాలపల్లి నవంబర్ 10:** రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని కూర్మాచలం వెంకటేశ్వర్లు గృహంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బందిని ప్రత్యక్షంగా పరిశీలించారు సర్వే డేటా ఎంట్రీ సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు మెటీరియల్ భద్రత కోసం ట్రంకు పెట్టెలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు సర్వేలో వేగం పెంచడం ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడటం, సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు గ్రామంలో మొత్తం 11 85 గృహాలు ఉన్నాయన్నారు వాటిని 91 ఎన్యూమరేట్స్ బ్లాకులుగా విభజించి సర్వే చేస్తున్నమని ఆయన తెలిపారు

## ఘనంగా దైవ కృప అనాధ ఆశ్రమంలో పి. ధర్మేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు

**ప్రతి ఒక్కరూ జన్మదిన వేడుకలు**

**అనాధ పిల్లల వారి సమక్షంలో జరుపుకోవాలి**

**జాతీయ అధ్యక్షులు మంగళపల్లి హుస్సేన్**



**తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 10:** నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పి ధర్మేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా దైవ కృప అనాధ ఆశ్రమంలో పిల్లల సమక్షంలో జరుపుకున్నారు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులో కేక్ కట్ చేసి అనంతరం పిల్లలకు అరటి పండ్లు, బిస్కెట్స్,స్నాక్స్, ఇవ్వడం జరిగింది,ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పుట్టినరోజు వేడుకలు అనాధ పిల్లల సమక్షంలో జరుపుకోవడం వలన వారికి ఉత్సాహ పరిచిన వాళ్ళం అవుతామని అన్నారు ఈ వేడుకల సందర్భంగా పిల్లలకు అనాధలకు వారికి ఆర్థిక సహాయం చేశారు,ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ మురళి, కమిటీ సభ్యులు శ్రీరామ్ ప్రసాద్, బండమీది సంపత్, రాజశేఖర్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్, కేసముద్రం మండలం నవీను, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ వాణి,స్నేహలత, భద్రాద్రి కొత్తగూ డెం జిల్లా మహిళా నీలిమ, చంద్ర ప్రకాష్, మనీ ప్రకాష్, శశిధర్,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## సుందరగిరిలో తాడిచెట్టుపై నుండి పడి గీతాకార్మికుడు మృతి

**చిగురుమామిడి / నవంబర్ 10**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కక్కర్ల కృష్ణస్వామి గౌడ్(58) అనే గీత కార్మికుడు తాటి చెట్టుపై నుండి కిందపడి మృతి చెందినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే కక్కర్ల క్రిష్టస్వామి కల్లుగీతా వృత్తిని జీవనోపాధిగా చేసుకొని తన కుటుంబాన్ని పోషించుకున్న క్రమంలో రోజువారీగా కళ్ళు గీసేందుకు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రేణుక ఎల్లమ్మ గుడి సమీపప్రాంతంలో కళ్ళు గీసేందుకు తాటి చెట్టు పైకిఎక్కి కళ్ళు గీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మొకుతాడు చెట్టు పైనుండి జారి చెట్టు ప్రక్కల ఉన్న సమీపంలో గుంతలో పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు గౌడ సంఘ నాయకులు తెలిపారు.

# 12న తెలంగాణ స్థానిక పత్రికల డిమాండ్లపై రాష్ట్రస్థాయి సదస్సు

**అక్రిడిటేషన్లు, ప్రకటనల కేటాయింపులో స్థానిక పత్రికలకు తీరని అన్యాయం**

**డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రావి కంటి శ్రీనివాస్**




**తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 10:** కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో స్థానిక పత్రికల పట్ల వివక్ష కొనసాగుతోందని బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ అన్నారు. అక్రిడిటేషన్లు, రేట్ కార్డ్ విషయంలో తెలంగాణ స్థానిక పత్రికల యాజమాన్యాలకు అన్యాయం జరుగుతూ వచ్చిందని ఆరోపించారు. బుధవారం కరీంనగర్ డబ్ల్యూజేఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడితే తమకు న్యాయం జరుగుతుందని స్థానిక పత్రికల యాజమాన్యాలు భావించాయని, అయితే గడచిన పదేళ్ల కాలంలో స్థానిక పత్రికల పరిస్థితులు మరింత దిగజారి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రాపకంతో, పైరవీలతో కొందరు మాత్రమే పెద్ద పత్రికల ముసుగులో లబ్ది పొందారని, విలువలతో నిత్యం పత్రికలు వెలువరిస్తున్న వారికి మాత్రం తీరని అన్యాయం జరిగిందని అన్నారు. 12 న స్థానిక పత్రికల హక్కుల సాధనకై సదస్సు ఈనెల 12వ తేదీన హైదరాబాద్ నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాలులో 'తెలంగాణ స్థానిక పత్రికల యాజమాన్యాలు- అక్రిడిటేషన్లు- రేటు కార్డు' విషయంలో జరుగుతున్న అన్యాయాలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో స్థానిక పత్రికల యాజమాన్యాల నుండి సలహాలు, సూచనలు తీసుకొని వాటిని క్రోడీకరించి ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నట్లు చెప్పారు. స్థానిక పత్రికల యాజమాన్యాలకు గుర్తింపు, గౌరవం దక్కేంతవరకు డబ్ల్యూజేఐ పోరాడుతుందన్నారు. స్థానిక పత్రికలకు జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అనునిత్యం ప్రభుత్వంతో ప్రాతినిధ్యం జరుపుతామని స్పష్టం చేశారు. 12వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే తెలంగాణ స్థానిక పత్రికల యాజమాన్యాల సదస్సుకు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో పత్రికలు నిర్వహిస్తున్న ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ లోకి... వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, అక్రిడికేషన్ సమస్యల పరిష్కార కమిటీ రాష్ట్ర కన్వీనర్ గా తాడూరు కరుణాకర్, యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా శివనాద్రి ప్రమోద్ కుమార్, రాష్ట్ర జాయింట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బెజ్జంకి నరేష్ లను నియమిస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు.

# విధ్వంసం సృష్టించి విజయోత్సవాలా : చదువు అన్నారెడ్డి



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 10 :** రాష్ట్రంలో కోలుకోలేని విధ్వంసం సృష్టించి విజయోత్సవాలు నిర్వహిస్తారా..ఎనుముల వారి ఏడాది ఏలికలో..తెలంగాణ బతుకు చీలికలు, పీలికలైందని, కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించాల్సింది విజయోత్సవాలు కాదని..'కుంభకోణాల కుంభమేళా' అంటూ సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి విమర్శలు గుప్పించారు. ఆదివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని పాతరేసిన నేపథ్యంలో జరపాల్సింది విజయోత్సవాలు కాదని..ప్రజావంచన వారోత్సవాలన్నారు.

ఎనుముల వారి ఏడాది పాలనలో చెప్పుకోవడానికి ఏమున్నది గర్వకారణం అంటే..మూసీలో లక్షన్నర కోట్ల మూటల వేట..కొడంగల్ లిఫ్టులో వేల కోట్ల కాసుల వేట..బావమరిదికి అమృత్ టెండర్లు, కొడుకులకు వేలకోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టే ముఖ్యమంత్రి, మంత్రులు జరుపుకోవాల్సింది విజయోత్సవాలు కాదని.."కరప్షన్ కార్నివాల్" అని అన్నారు. ఏడాది కాలంగా ప్రతిరోజూ పరిపాలనా వైఫల్యాలకు కేరాఫ్ కాంగ్రెస్ సర్కారని..సకల రంగాల్లో సంక్షోభం తప్ప సంతోషం లేని సందర్భాలకు చిరునామా రేవంత్ పాలన అని..మరి ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు నిర్వహిస్తారని చదువు అన్నారెడ్డి ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల్లో ఒక్కటంటే ఒక్క వాగ్దానం కూడా సరిగ్గా అమలు చేయకుండా జనం పైసలతో 25 రోజులపాటు జల్సాలు చేసుకుంటారా..అని ప్రశ్నించారు. "రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం అందక, పేద రైతులు దు:ఖంలో ఉంటే..మీరు వందల కోట్లతో విజయోత్సవాలు చేసుకుంటారా..హైడ్రా, మూసీ బాధితులు బాధలో ఉంటే మీరు బాజాభజంత్రీలతో పండుగ చేసుకుంటారా..ఆడబిడ్డలు రక్షణ లేక అల్లాడుతుంటే మీరు విజయోత్సవాల పేరిట విర్రవీగుతారా..వృద్ధులు పింఛన్ల పెంపు కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటే మీరు దయలేకుండా దావత్‌లు చేసుకుంటారా" అంటూ ఆయన ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ భర్తీ చేసిన ఉద్యోగాల ప్రక్రియను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడం నయవంచన కాదా..అని ప్రశ్నించారు.

పావుశాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండా వందశాతం చేశామని చెప్పుకోవడం దగా కాదా..200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కే సిలిండర్ పథకాలకు సవాలక్ష ఆంక్షలు పెట్టి మెజారిటీ అర్హులను దూరం చేయడం మోసం కాదా..75 ఏళ్ల స్వతంత్ర్య భారత చరిత్రలో అతితక్కువ సమయంలో అత్యధిక ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న తొలి ప్రభుత్వం, ఏకైక రాష్ట్ర ప్రభుత్వం ఇదేనని..ఈ ముఖ్యమంత్రికి పాలనపై పట్టు కాదు..ఈ ప్రభుత్వానికి తెలంగాణపై ప్రేమలేదని విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చి రోడ్డున పడేసిన కాంగ్రెస్ సర్కారుకు అసలు మనసే లేదని. విజయోత్సవాలు అంటే ఏంటో కూడా తెలియని ఈ అసమర్థ పాలకులకు ఆ పదాన్ని వాడే హక్కే లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

# జిఎస్టీతో చేనేతకు ఉరి !

**తొలి సమయం హైదరాబాద్,**

భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 7ని జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకుంటారు. చేనేత కార్మికుల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి, చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రంగంలో ఎక్కువ మంది నేత కార్మికులు మహిళలే కాబట్టి, వారికి మద్దతు,కృతజ్ఞతలు తెలియజేయడానికి ఈ రోజు ఒక ముఖ్యమైన అవకాశం. జాతీయ చేనేత దినోత్సవాన్ని తొలిసారిగా 2015 ఆగస్టు 7న ప్రధాని నరేంద్ర మోదీ చెన్నైలో ప్రారంభించారు. 1905లో ఇదే రోజున కోల్‌కతాలో స్వదేశీ ఉద్యమం ప్రారంభమైన నాటి జ్ఞాపకార్థం ఈ దినోత్సవాన్ని పాటించడం దీనివెనుక ఉద్దేశం. అలాగే, చేనేత ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించడానికి, 'ఇండియా హ్యాండ్లూమ్ ముద్ర' 2015లో ఈ రోజున ప్రవేశపెట్టబడింది. భారతీయ చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచడం ఈ రోజు ప్రాథమిక లక్ష్యం. జాతీయ చేనేత దినోత్సవం సవాళ్లను ఎదుర్కొనే చేనేత నేత కార్మికులకు మద్దతు ఇవ్వడానికి పౌరులందరినీ కలిసి పనిచేయాలని ప్రోత్సహిస్తుంది. 1905లో కలకత్తాలో బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్ర పాల్, లాలా లజపతిరాయ్ నాయకత్వంలో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే చారిత్రాత్మక పిలుపుని కూడా జాతీయ చేనేత దినోత్సవం గుర్తు చేస్తుంది. జాతీయ చేనేత దినోత్సవాన్ని తొలిసారిగా 2015లో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన అతి ముఖ్యమైన తిరుగుబాటు. చేనేత కార్మికులు చేతితో బట్టలు నేస్తారు. ఒక చీర నేయాలంటే ఒక నేత కుటుంబం మొత్తం నెలల తరబడి శ్రమించాల్సి వస్తుంది. చేనేత కార్మికులు కష్టపడి పనిచేసినా వారికి తగిన ప్రతిఫలం లేక ప్రాధాన్యత ఇవ్వలేదు. అందుకే చేనేత పరిశ్రమ కుళ్లిపోయే స్థితికి చేరుకుంది. భారతదేశంలో ఉపయోగించే వస్త్రాల్లో 15శాతం మాత్రమే చేనేత వస్త్రాలు. అటువంటి పరిస్థితిలో, నేత కార్మికులకు ప్రాముఖ్యత, ప్రతిఫలాన్ని అందించడానికి భారత ప్రభుత్వం 2015 నుండి ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. వ్యవసాయం తర్వాత, చేనేత పరిశ్రమ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన స్తంభాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. 70శాతం భారతీయ మహిళలు నేత కార్మికులుగా తమ సేవలను అందిస్తున్నారు; కాబట్టి ఈ రంగం ఉపాధికి అతిపెద్ద చిహ్నంగా మారుతోంది. జాతీయచేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేతపై జిఎస్టీ ఎత్తేయాలన్న డిమాండ్ వస్తోంది. జిఎస్టీ వాయింపులను కేంద్రం సవరించేదాకా చర్చించాల్సిన సమయమిది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కళ్లు తెరిచే వరకు అన్ని సందర్భాల్లోనూ చర్చించాలి. అలాగే లోక్‌సభలో సభ్యులు అన్నింటిని మించి ఇదే పెద్ద సమస్యగా చర్చకు తెరలేపాలి. జిఎస్టీ అనే పీడనుంచి ప్రజలను బయట పడేసేందుకు ఎన్‌డిఎ పక్షాలతో పాటు, ఇండియా కూటమి నేతలు కూడా పోరాడాల్సిన సమయమిది. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై వస్తు, సేవల పన్ను జిఎస్‌టి తొలగించాలన్న డిమాండ్ల వేళ ఆసక్తికర గణాంకాలను కేంద్రం పార్లమెంట్ ముందుంచింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఆరోగ్య బీమా ప్రీమియంలపైనే రూ.8,263 కోట్ల జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం పార్లమెంట్‌కు తెలిపింది. ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని తొలగించాలని ఇటీవల కేంద్రమంత్రి గడ్కరీ.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సైతం ఇదే తరహా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో వీటిని తొలగించా లంటూ పలు విజ్ఞప్తులు వచ్చినట్లు పంకజ్ చౌధరి వెల్లడించారు. ఈ రెండు రకాల బీమా ప్రీమియంలపై ప్రస్తుతం 18 శాతం చొప్పున జీఎస్టీ వసూలు చేస్తున్నారు. జీఎస్టీ తొలగింపుపై కేంద్రం, రాష్ట్రాలతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయం లో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు తక్షణం కౌన్సిల్ సమావేశానికి డిమాండ్ చేయాలి. ఇకపోతే మరో వాత చేనేతపై పడుతోంది. చేనేతపై జీఎస్టీ అనాలోచిత నిర్ణయంగానే చెప్పాలి. చేనేతను ప్రోత్సహించా ల్సిన సమయంలో జిఎస్టీ వేయడం వల్ల కార్మికులకు ఉపాధి కష్టంగా మారింది. మోదీ సర్కార్ నేతన్నల కడుపుకొడుతోందని వారు మండిపడ్డారు. టెక్స్‌టైల్, చేనేత రంగాలపై కేంద్రం నిరాసక్తత చూపుతోందని తప్పుబట్టారు. జౌళి రంగానికి, చేనేత కార్మికులకు బీజేపీ సర్కార్ పైసా సాయం చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. చేనేత, జౌళి రంగాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గతంలో తెలంగాణ మంత్రిగా కేటీఆర్ డిమాండ్ చేశారు. చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని, టెక్స్‌టైల్‌పై జీఎస్టీ తగ్గించాలని నేతన్నలు కూడా కోరుతున్నారు. చేనేత, జౌళి రంగాల సమస్యలపై పార్లమెంట్‌లో నిలదీయాల్సి ఉంది. దీనిపై పడుతున్న భారాన్ని చర్చించాలి. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తోన్న రంగం ఏదైనా ఉందంటే అది కేవలం టెక్స్ టైల్ రంగమని చెప్పుకోవాలి. దేశంలో టెక్స్ టైల్, చేనేత రంగాలకు ప్రోత్సాహం కల్పించాల్సిన అసవరం గుర్తించాలి. శుష్క వాగ్దానాలు,రిక్త హస్తాలు అన్నట్టుగా వ్యవహరిస్తున్న మోడీ సర్కార్... తెలంగాణ నేతన్నల కడుపు కొడుతోందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. తెలంగాణ టెక్స్ టైల్ రంగానికి సాయం చేశామంటూ ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులు చెప్పేవన్నీ అబద్దాలన్నారు. రాష్ట్ర టెక్స్ టైల్, చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం నయాపైసా అదనపు సాయం చేయలేదని గతంలో కేటీఆర్ ఆరోపించారు. దేశంలోని ఎన్నో రంగాలను చేసినట్టుగానే టెక్స్ టైల్, చేనేత రంగాలను మోడీ నిర్వీర్యం చేశారన్నారు. అందుకే చేనేతపైన జీఎస్టీ వంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగాహ్యాండ్లూమ్ క్లస్టర్ లను ఏర్పాటు చేయాల్సిన అసవరం ఉంది. చేనేత పైన జిఎస్టీ రద్దు చేయాలి లేదా టెక్స్ టైల్స్ పైన జీఎస్టీ తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలోని చేనేత కార్మికులపై కేంద్రానికి ప్రేమ ఉంటే ఈ అగస్టు 7తేదిన జరిగే జాతీయ చేనేత దినోత్సవం నాటికి టెక్స్ టైల్స్, చేనేత రంగంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.


## సామాజిక సర్వేలో వివరాలు సేకరిస్తున్న పంచాయతీ సెక్రెటరీ నరేష్



**తొలి సమయం భూపాలపల్లి నవంబర్ 10 :** రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా సామాజిక, ఆర్థిక,, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల గణన సర్వే జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో 8 మంది ఏన్యూమారేటర్ లచే సర్వేను ప్రారంభించడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహబూబ్ హుస్సేన్ తెలిపారు. కాగా మొగుళ్లపల్లి గ్రామ పంచాయతీ సెక్రెటరీ నరేష్ సర్వేలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుంచి వివరాలను సేకరిస్తున్నారు.

## ఇందిరమ్మ రాజ్యానికి బాటలు వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,పోలినేని లింగారావు**



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 10 :** పేదరిక నిర్మూలన కోసం ఇందిరమ్మ చేపట్టిన సంక్షేమ పథకాలను కొనసాగింపుగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త పథకాలకు శ్రీకారం చుట్టి ఇందిరమ్మ రాజ్యానికి బాటలు వేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలినేని లింగారావు అన్నారు. ఆదివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు అందిస్తూ..ఇందిరమ్మ కలలుగన్న రాజ్యాన్ని నిర్మించుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటల పాటు పనిచేస్తున్నారన్నారు.

## మొట్లపల్లిలో విషాదం

**- బైక్ అదుపు తప్పి ఒకరి మృతి..మరొకరికి తీవ్రగాయాలు**

**- గాయాల పాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలింపు**



**తొలి సమయంజయశంకర్ భూపాలపల్లి నవంబర్ 10:** జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ బి. అశోక్ కథనం ప్రకారం మొట్లపల్లి గ్రామానికి చెందిన గాదం సతీష్ (38) అనే వ్యక్తి జమ్మికుంట ఎఫ్ సీ ఐ గోదాంలో హామాలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే శనివారం పనికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో తనతో పాటు పనిచేసే సిరిసేడు గ్రామానికి చెందిన రేణికుంట్ల రాజు అనునతని ఇంటివద్ద పెండ్లికి ముందు జరిగే కూరాల్ల పండుగకు హాజరై.. తనకు తమ్ముడి వరుసైన నూకల శ్యామ్ కు ఫోన్ చేసి రమ్మన్నాడని,.దీంతో శ్యామ్..దినేష్ అనే వ్యక్తితో సిరిసేడు గ్రామానికి వెళ్లారని, రాత్రి 11 గంటల సమయాన తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో సతీష్ నడుపుతున్న పల్సర్ టూ వెహికిల్ నం: %ఋ%: 25-3627 గలదానిపై వెనకాల శ్యామ్ ను కూర్చోబెట్టుకొని మొట్లపల్లికి వస్తుండగా..మొట్లపల్లి గ్రామ శివారులోని చిలుకూరి దేవేందర్ రెడ్డి భూమి దగ్గరకు చేరుకునేసరికి సతీష్ అట్టి బైకును అతివేగంగా, అజాగ్రత్తగా రోడ్డు ప్రక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టగా..ఎగిరి కల్వర్టు మీద పడడంతో తలకు బలమైన గాయాలై సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడని, వెనకాల కూర్చున్న శ్యామ్ కి తలకు, శరీరంలోని వివిధ భాగాలకు గాయాలు తగిలి కదలలేని పరిస్థితిలో ఉన్న అతనిని ఉదయాన అటువైపుగా వెళ్లిన బాటసారిలు చూసి 108 కు సమాచారం అందించడంతో అతనిని చిట్యాలలోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు, మృతుడు సతీష్ భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101